క్లుప్తంగా

వచన కవితా విప్లవకర్త శ్రీశ్రీ



నివాళి అర్పిస్తున్న కవులు

సిరిసిల్లకల్చరల్: మహాకవి శ్రీశ్రీ వచన కవితా విప్లవకర్తగా మిగిలిపోయాడని పలువురు కవులు అన్నారు. శనివారం శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా గాంధీ సర్కిల్‌లోని లక్ష్మణ్ ప్రింటర్స్‌లో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. సిరిసిల్ల సాహితీ సమితి ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, బూర దేవానందం, ఆడెపు లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు. దొంత దేవదాస్, గణేశ్, అంకారపు రవి, కోడం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన నాయకులు



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్

చందుర్తి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు, చందుర్తి మండల కేంద్రవాసి సిరికొండ శ్రీనివాస్ శనివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు.



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌ను శనివారం ఢిల్లీలో కలిశారు. వారిని సన్మానించారు.



సంజయ్‌ను కలిసిన ఎంపీపీ మల్లేశ్‌యాదవ్

వేములవాడ రూరల్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశ్‌యాదవ్ శనివారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజన్న ప్రసాదాన్ని మంత్రి అందజేశారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం

కోనరావుపేట: ధర్మారం, నిజామాబాద్, మల్కపేట, పల్లిమక్త, కొలనూర్, రామన్నపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కనకమ్మ మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలన్నారు. ఎంపీటీసీ రేణుక, అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, వెలిశాల రమాదేవి, జొన్నల అరుణ, నేరెళ్ల చంద్రకళ, సునీత, విజయలక్ష్మి, దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోరు మోటారు మంజూరు చేయండి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన విశ్వబ్రహ్మణ మనుమయ సంఘం భవనానికి బోరు మోటారు మంజూరు చేయాలని కోరుతూ సంఘ సభ్యులు శనివారం జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. జెడ్పీటీసీ స్పందించి తనవంతు ప్రయత్నం చేసి బోరు మోటారు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు కోడిమోజు దేవేందర్, ప్రధాన కార్యదర్శి చందనం బ్రహ్మాచారి, సభ్యులు అశోక్, రామాచారి, నిరంజన్, రవీందర్, అశోక్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

బోయినపల్లి: మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే చర్యలుంటాయని ఏఎస్సై మోతీరామ్, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శనివారం మైనర్ వాహన డ్రైవింగ్ తనిఖీలతోపాటు నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు నంబర్లు రాయించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఇద్దరు మైనర్లు బైకులు నడుపుతుండగా పట్టుపడ్డారు. వారి బైకులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆటలు

కోనరావుపేట: వర్షాలు కురవాలని మంగళ్లపల్లిలో కప్పతల్లి ఆటలు ఆడారు. చిన్నారులు కప్పతో ఊరేగింపు నిర్వహించారు.

బెస్ట్ అవేలబుల్ స్కూల్‌లో ప్రవేశాలకు డ్రా

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశాలకు శనివారం కలెక్టరేట్‌లో డ్రా తీసి అర్హులను ఎంపిక చేశారు. మొత్తం 138 దరఖాస్తులు రాగా డ్రా తీసి 46 మంది విద్యార్థులకు ప్రవేశార్హత కల్పించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎస్సీడీవో అజ్మీర వినోద్‌కుమార్, డీఈవో రమేశ్, జిల్లా కోఆర్డినేటర్ జాక్విలిన్ తదితరులు పాల్గొన్నారు.

- అదుర్స్.. ఇన్‌స్టాంట్ మిక్స్
- బిజీ జీవితాలకు కలిసొస్తున్న కాలం
- నిమిషాల్లో బ్రేక్ ఫాస్ట్ రెడీ

వెరీ టేస్టీ.. టైమ్ సేఫ్టీ

సిరిసిల్లటౌన్: పొద్దున లేవగానే బ్రేక్ ఫాస్ట్‌గా ఇడ్లి, వడ, దోశ, వగైరా తినడానికి అందరూ ఇష్టపడతారు. వీటిని తయారు చేయడానికి ఇంట్లో మహిళలకు ఎక్కువ సమయాన్ని తీసుకోవాల్సి వస్తుంది. ఒకరోజు ముందుగానే పిండిని రుబ్బి తయారుగా ఉంచుకోవాలి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. వంటకం ఏదైనా సరే.. మార్కెట్‌లో రెడీమిక్స్‌ల పద్ధతిలో అందుబాటులో ఉన్నాయి. ప్యాకెట్ విప్పిన నిమిషాల్లోనే బ్రేక్ ఫాస్ట్ తయారు చేసుకునే ఇన్‌స్టాంట్ ఫుడ్ ప్యాక్‌లపై ఈవారం సండే స్పెషల్ స్టోరీ మీకోసం.





ఇష్టంగా.. బ్రేక్ ఫాస్ట్‌గా..

ఉదయమే వంట చేసి ఆఫీసుకు వెళ్లే మహిళలు, విద్యార్థులు పొద్దునే ఇష్టమైన టిఫిన్స్ తినడానికి ఇన్‌స్టాంట్ రెడీమిక్స్ ప్యాక్స్ ఉపకరిస్తున్నాయి. ఇన్‌స్టాంట్ ఫుడ్ మూలంగా పొద్దంతా బిజీగా గడిపేవారందరూ.. వీటిని ఇష్టపడుతున్నారు. ఇడ్లీ, వడ, ఉప్మా, ఉతప్పా, దోశలను తయారు చేయడానికి రెడీమేడ్ మిక్స్‌లతో అయిన వారికి, ఇంటికి వచ్చి వెళ్లే అతిథులకు వారికిష్టమైన అల్పాహారాలను తయారు చేస్తున్నారు. వీటి వాడకం మూలంగా ఇంటిల్లిపాదికి ఇష్టమైన టిఫిన్స్‌ను వడ్డించడమే కాకుండా సమయం కూడా కలిసి వస్తుంది. పిండిని ఒకరోజు ముందే నానబెట్టి, రుబ్బుకునే పని లేకపోవడంతో వీటిని అన్ని వర్గాల ప్రజలు వినియోగిస్తున్నారు. ఇక క్షణాల్లో తయారయ్యే పాస్తా, ఓట్స్, మసాలా ఓట్స్, నూడుల్స్ వంటివి కూడా లభిస్తున్నాయి. ఇన్‌స్టాంట్ రెడీమిక్స్ టిఫిన్ పదార్థాలను బ్రాండెడ్ కంపెనీలు అందిస్తుండటంతో.. బిజీగా ఉండే మహిళలు, ఉద్యోగులు, వంట సరిగా రాని బ్యాచ్‌లర్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

అన్ని మార్టులు.. షాపుల్లో లభ్యత..

సండే స్పెషల్

మార్కెట్‌లో రెడీమిక్స్‌లకు ఆదరణ పెరిగింది. పెద్ద పెద్ద షాపింగ్ సెంటర్లు, సూపర్ మార్కెట్లు మొదలుకొని చిన్నచిన్న కిరాణా షాపుల్లో సైతం ఇన్‌స్టాంట్ ఫుడ్ మిక్స్‌లు అందుబాటులో ఉండటంతో వీటికి ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన ఇడ్లీ, వడ, ఉప్మా, దోశ, పెసరట్లు, రవ్వ దోశతోపాటు చిన్న పిల్లలు ఇష్టపడే మ్యాగి నూడుల్స్, పాస్తా, కార్న్‌ఫ్లాక్స్, ఓట్స్ వంటి చిరుతిండ్లు కూడా సందడి చేస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలు వీటిని కొనుక్కునే ధరల్లోనే కంపెనీలు తయారు చేస్తున్నాయి. సిరిసిల్లలోని మార్కెట్‌లో దొరుకుతున్న కొన్ని ఇన్‌స్టాంట్ రెడీమిక్స్‌ల ధరలు కూడా రూ.50 నుంచి రూ.300 లోపు ఉన్నాయి.

ఇంటి ఫుడ్.. వెరీ గుడ్

బ్రేక్ ఫాస్ట్ చేసేవారు ప్రతిరోజు బయట తింటే అనారోగ్యం బారిన పడే అవకాశముండటంతో.. ఇన్‌స్టాంట్ ఫుడ్ మిక్స్ ప్యాకెట్లకు ప్రజలు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటిపట్టునే తయారు చేసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. ఇక పొద్దునే బడికి వెళ్లే చిన్నారులకు మార్కెట్‌లో వందలాది రకాలుగా ఇన్‌స్టాంట్ సాఫ్ట్ ఫుడ్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయి. వేడివేడి పాలల్లో వేసుకునే కార్న్‌ఫ్లాక్స్, చాకోస్ చిన్నారులకు ఇష్టమైన ఫుడ్. ఇక నిమిషాల వ్యవధిలో తయారు చేసే ఓట్స్, మసాలా ఓట్స్, నూడుల్స్, మైక్రోన్స్(పాస్తా) వంటి కొత్తకొత్త స్నాక్స్‌ను ప్రజలు ఆదరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఫ్రెంచ్ ఫ్రయిస్‌కు డిమాండ్ ఉంది. వీటిని రెడీమేడ్‌గా బ్రాండెడ్ కంపెనీలు అందిస్తున్నాయి. సాఫ్ట్ ఫుడ్ తినడానికి అనువుగా, తయారు చేసుకోవడంలో పెద్దగా పనేమి లేకపోవడం, రుచిగా ఉండటంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

అనుమతులున్న ఫుడ్ ఐటమ్స్ వాడాలి



ఫుడ్ ఐటమ్స్ కొనేప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. ఐటమ్స్‌పై ఎఫ్ఎస్ఎస్ఐ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్ట్స్ అథారిటీ) అనుమతి పొందిన కంపెనీల ఫుడ్ ఐటమ్స్‌ను వినియోగించడం మేలు. ఇక బ్రేక్ ఫాస్ట్‌కు ఇన్‌స్టాంట్ ఫుడ్ మిక్స్‌లు అందరికి ఉపయోగంగా ఉంటున్నాయి. ఉద్యోగాలు, బయటకు వెళ్లే వారికి సమయం చాలా సేఫ్.

– కల్వకోట అరుణ, న్యాయవాది, సిరిసిల్ల

కోరుకున్న అల్పాహారం నిమిషాల్లో..



ఇన్‌స్టాంట్ ఫుడ్‌తో టైం బాగా కలిసొస్తుంది. రెడీమేడ్ మిక్స్‌లతో వండటం చాలా సులువైంది. పొద్దునే హడావిడిలో వెళ్లే పిల్లలకు ఇష్టమైన టిఫిన్స్ తయారు చేసే అవకాశం వచ్చింది. అనుకోని ప్రయాణాలు తారసపడినా.. అతిథులు వచ్చినా వీటిని వాడుకోవచ్చు. కోరుకున్న అల్పాహారం నిమిషాల్లో వండుకునే అవకాశం దక్కింది. టేస్ట్ కూడా బాగా ఉంటున్నాయి.

– పుల్లూరి రాధ, గృహిణి, సిరిసిల్ల

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట: మండలంలో విద్యుత్‌పరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. రాచర్లబొప్పాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. గ్రామాల్లో ఉన్న లూజ్ వైర్లను సరి చేయడంతోపాటు అదనంగా స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నిరంతరంగా కరెంట్ సరఫరా చేస్తామని అన్నారు. లైన్‌మెన్ శ్రీనివాస్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, కిష్టారెడ్డి, స్వామి, హెల్పర్లు పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రలు పంపిణీ చేయాలి

ముస్తాబాద్: చిన్నారుల్లో నులి పురుగులను నివారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజేందర్ కోరారు. మండల పరిషత్‌లో నులి పురుగుల నివారణకు చేపట్టే కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

ముస్తాబాద్(సిరిసిల్ల): కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని, వారిని కాపాడుకుంటుందని సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డికి ఇటీవల బైపాస్ సర్జరీ జరగగా.. ఆయనను మహేందర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త నాంపెల్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

మహిళపై పిచ్చి కుక్క దాడి

చందుర్తి(వేములవాడ): మల్యాల గ్రామానికి చెందిన మల్యాల శివవ్వ అనే మహిళపై శనివారం సాయంత్రం పిచ్చి కుక్క దాడి చేసింది. శివవ్వ కాలుపై కరవడంతో ఇంజక్షన్ వేయించుకునేందుకు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఆసుపత్రిలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో.. అక్కడికి వచ్చినవారితో వైద్యాధికారికి ఫోన్లు చేయించింది. అయినా ఫలితం లేక రెండు గంటలపాటు ఆసుపత్రి ఆవరణలో నిరీక్షించి వెనుదిరిగింది. ఈ క్రమంలోనే ఆసుపత్రి ఆవరణకు చేరుకున్న 108 అంబులెన్స్ ఫార్మసిస్టు మహిళలకు ఇంజక్షన్ ఇచ్చి వైద్యం చేశారని బాధితురాలి బంధువులు తెలిపారు.

దుర్గామాత ఆలయ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్



కమిటీ సభ్యులతో గ్రామస్తులు

చందుర్తి: మండల కేంద్ర శివారులోని నవ రత్నాల దుర్గామాత ఆలయ కమిటీ అధ్యక్షుడిగా లింగాల శ్రీనివాస్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉలిసే ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా దారం రాంచంద్రం, కార్యదర్శులుగా పోంచెట్టి తిరుపతి, ఆవునేని సతీశ్, కోశాధికారిగా మోతె బాబు, సలహాదారులుగా సిరికొండ తిరుపతి, లింగంపల్లి వెంకటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు పులి రేణుక సత్యం తెలిపారు.

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



కోనరావుపేట: పల్లిమక్త గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా నాయిని ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సమావేశమైన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కదిరె ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అలిపిరి అంజిరెడ్డి, సలహాదారుగా అలిపిరి ఆనందరెడ్డి, కోశాధికారిగా కదిరె దుర్గారెడ్డి, సభ్యులు ఎన్నికయ్యారు.

పాల కేంద్రం అధ్యక్షుడిగా మల్లయ్య

వేములవాడరూరల్: లింగంపల్లి గ్రామ పాల కేంద్రం నూతన పాలకవర్గం అధ్యక్షుడిగా మంతె మల్లయ్య ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చంద్రగిరి శ్రీకాంత్, సభ్యులుగా సామ లచ్చిరెడ్డి, సామ నర్సింహారెడ్డి, ఆకుల శ్రీనివాస్, గాజుల తిరుపతి, సామ తిరుపతిరెడ్డి, జోగినిపల్లి ఎల్లయ్య, సామ లచ్చిరెడ్డి, సూపర్‌వైజర్ మల్లేష్ ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

ముగిసిన క్రికెట్ పోటీలు

గంభీరావుపేట: సముద్రలింగాపూర్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. వారియర్ జట్టు ప్రథమ, సూపర్ కింగ్ జట్టు ద్వితీయ బహుమతిని సాధించాయి. నాయకులు రాజారాం, రామానుజాగౌడ్, కిషన్‌గౌడ్, మహేశ్‌యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు.

చెక్కు అందజేత

వేములవాడ: ప్రమాదవశాత్తు మరణించిన గాయత్రి బ్యాంకు ఖాతాదారుడైన చింతలతాడె రాజలింగం కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కును నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా నామిని అయిన మృతుడి కుమారుడు లింగమూర్తికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. ఏజీఎం వంశీకృష్ణ, బ్రాంచి మేనేజర్ జి.గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో పీఎంజేజేబీవై పథకం కింద మంజూరైన చెక్కులను శనివారం మృతుల కుటుంబాల సభ్యులకు బ్యాంక్ మేనేజర్ లింగారెడ్డి అందజేశారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌కు చెందిన తీగల మమత, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన చెక్కల అంజయ్య అనారోగ్యంతో మరణించగా.. రూ.2లక్షల చొప్పున చెక్కులను మమత భర్త దేవాగౌడ్‌కు, అంజయ్య భార్య ఊర్మిలకు అందజేశారు. బ్యాంక్ అకౌంటెంట్ భూలక్ష్మి, ఫీల్డ్ అధికారి నరేందర్, క్యాషియర్ జానీ, లిఖిత, సిబ్బంది పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

ముస్తాబాద్: మొర్రాయిపల్లెలో గ్రామస్తులు పోచమ్మ బోనాలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి పెద్దఎత్తున తరలివెళ్లారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ సర్పంచులు పద్మ, సుజాత, నాయకులు అల్లం లక్ష్మణ్, మెంగని శ్రీనివాస్, ఎల్లం, రాజిరెడ్డి, సతీష్, జనార్దన్, నాగరాజు, కొమురయ్య, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ సావనపెల్లి రాకేశ్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించడం గొప్ప విషయమని ఎంపీపీ వుట్కూరి వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, అంగన్వాడీ చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు.

మొర్రాపూర్ చెరువును కాపాడాలి

ముస్తాబాద్: మొర్రాపూర్‌లోని రేగులకుంట చెరువును కాపాడాలని నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులకు మాజీ సర్పంచ్ భూక్య దేవేందర్‌నాయక్ శనివారం విజ్ఞప్తి చేశారు. మొర్రాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి రేగులకుంట చెరువు శిఖం భూమిలో దర్జాగా బావిని తవ్వాడని, చెరువు నీరు అటువైపు రాకుండా మట్టిని, బండరాళ్లను అడ్డుగా వేశాడని ఫిర్యాదు చేశాడు.

జాబ్ మేళాకు స్పందన

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 55 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించినట్లు కళాశాల నిర్వాహకుడు గుగ్గిళ్ల జగన్‌గౌడ్ తెలిపారు. అజా, సెవెన్ టెక్ ఐటీ సొల్యూషన్స్, థ్రెడ్స్, ఏక్సిస్ బ్యాంక్ ప్రతినిధులు హాజరైన మేళాలో సుమారు 300 మంది ఉద్యోగార్థులు పాల్గొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అందజేశారు.

మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలి

ముస్తాబాద్: మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికై స్వగ్రామం గూడెంకు దేవయ్య శనివారం తొలిసారి రాగా.. మున్నూరు కాపులు ఘనంగా సన్మానించారు. గూడెం గ్రామానికి పేరు తీసుకొచ్చారన్నారు. దేవయ్య మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరముందన్నారు. ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, వెంకటరమణ, నర్సయ్య, కిష్టయ్య, తిరుపతి, అనిల్, విష్ణు, నారాయణ, రాజయ్య, రామయ్య, వెంకన్న, భూపాల్ పాల్గొన్నారు.

విద్యానిధులు దుర్వినియోగం చేస్తుండ్రు



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ నిధులను దుర్వినియోగం చేస్తుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ విమర్శించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌పై అక్కసుతో పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుపై సర్కారు అభ్యంతరం చెప్పడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న విద్యాశాఖ సమస్యలు పరిష్కారం కోసం వెంటనే విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన విద్యా సంక్షేమ పథకాలు కొత్త సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేయాలని కోరారు. నాయకులు మట్టె శ్రీనివాస్, ఒగ్గు అరవింద్, రుద్రవేణి సుదీప్, కోడం వెంకటేశ్, భాను, తిరుపతి, వంశీ, సందీప్, నరేశ్ పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



గుండారంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అర్హత గల ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల నేత కులేరి ప్రేమ్‌సాగర్ డిమాండ్ చేశారు. రాచర్లగుండారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్నో పోటీ పరీక్షలను ఎదుర్కొని అర్హతలు సాధించి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా నియామకమైనా.. సగటు ఎస్జీటీలకు పండితులుగా గాని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు పప్పుల శ్రీనివాస్, కవిత, పద్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ అధికారులు తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతు పనులు చేస్తున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. శాంతినగర్, కలెక్టరేట్, రగుడు, శ్రీనగర్, దోభీగల్లీ, అంబేడ్కర్‌నగర్, సిద్దార్థనగర్, పోచమ్మవీధి, మార్కండేయవీధి, భావనారుషినగర్, గాంధీనగర్, రాళ్లబావి ఏరియా, గీతానగర్, వేంకటేశ్వర టెంపుల్ ఏరియా, విద్యానగర్, సుభాష్‌నగర్, నెహ్రూనగర్, సాయినగర్, వెంకట్రావునగర్, గోపాల్‌నగర్, బీవైనగర్, గణేశ్‌నగర్, న్యూబస్టాండ్, ఇందిరానగర్, బాబానగర్, శివనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల జోరు... జనం బేజారు

- భయంతో వణికిపోతున్న విద్యార్థులు



వేములవాడలోని ప్రధాన రహదారిపై వేగంగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

వేములవాడ/వేములవాడరూరల్: వేములవాడలో ఇసుక ట్రాక్టర్లు బీభత్సం సృష్టిస్తున్నాయి. పట్టణంలో వేగంగా నడుపుతున్న ఇసుక ట్రాక్టర్లతో విద్యార్థులు బడులకు వెళ్లేందుకు భయపడిపోతున్నారు. ప్రభుత్వం మూలవాగులోంచి గృహావసరాల కోసం వారంలో మూడు రోజులు మంగళ, బుధ, శనివారాలు అనుమతినిస్తోంది. దీంతో ట్రాక్టర్లు ఇసుక లోడింగ్‌కు వెళ్లే క్రమంలో విపరీతమైన స్పీడ్‌తో రోడ్లపై తిరుగుతుండటంతో.. వాహనదారులు, జనం, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, చిన్నారులు, తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. శనివారం పాపన్నచౌక్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ట్రాక్టర్ల స్పీడ్‌ను చూసి అంతా అవాక్కయ్యారు. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని, స్కూళ్లకు వెళ్లే చిన్నారులెక్కడ ప్రమాదానికి గురవుతారోనని వణికిపోయారు. అధికారులు కాస్త శ్రద్ధ వహించి ట్రాక్టర్ల స్పీడ్‌కు బ్రేక్ వేయకుంటే స్కూళ్లకు వెళ్లే చిన్నారులు, వాళ్లను దింపే తల్లిదండ్రులు, వాహనదారులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం లేకపోలేదని స్థానికులు సూచిస్తున్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



తిరుపతి(ఫైల్)

బోయినపల్లి: బతుకుదెరువు కోసం దుబాయి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వలస జీవి మృతదేహం శనివారం స్వగ్రామం బూర్గుపల్లికి రాగా.. గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగిపెల్లి తిరుపతి(42) 18 సంవత్సరాలుగా జీవనోపాధికి దుబాయి వెళ్తున్నాడు. అక్కడ ఆల్ ఆశ్రమ కంట్రాక్ట్ కంపెనీలో 18 ఏళ్లుగా లేబర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అప్పు చేసి గ్రామంలో ఇల్లు నిర్మించుకున్నాడు. గతేడాది వినాయక చవితి సమయంలో చివరిసారిగా బూర్గుపల్లి వచ్చి వెళ్లాడు. ఈనెల 2న దుబాయిలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. తిరుపతి మృతి వార్త ఈనెల 8న అతడి గదిలో ఉండే వ్యక్తి ద్వారా కుటుంబీకులకు తెలిసింది. తిరుపతి మృతిచెందిన సమాచారం కంపెనీ వారు తెలపలేదని వారు పేర్కొన్నారు. తిరుపతి భార్య లావణ్య కూలి పని చేస్తోంది. కుతూరు అక్షిత, కుమారుడు నవదీప్ ఉన్నారు. తిరుపతి మృతదేహం స్వగ్రామానికి రావడానికి గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి(జీడబ్ల్యూపీసీ) వారు విశేష కృషి చేసినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

వడ్డీ లేని రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట: గ్రామాల మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం ఇస్తున్న వడ్డీ లేని రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని సెర్ప్ కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల గ్రామ సంఘాల వీవోఏలు, మహిళా సంఘాల ప్రతినిధులతో బ్యాంక్ లింకేజీ, మార్కెటింగ్, పుస్తక నిర్వహణ, గ్రేడింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ స్కూల్ యూనిఫామ్స్, బకాయిలపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సీసీలు మంగ్యానాయక్, రమణ, పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ బాబు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాల్వ కబ్జా.. పొలంలో నిర్మాణాలు!



వేములవాడ: కట్ట మరమ్మతు పేరుతో అనుమతులు తీసుకొని యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కొందరు రియల్టర్లు తమ భూములను రక్షించుకునేందుకు కొత్తకొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. కాల్వ స్వరూపాన్నే మార్చివేస్తున్నారు. వేములవాడలోని పంపుహౌస్‌కు వెళ్లే దారిలో ఓ వరద కాల్వ ఉంది. కోనాయపల్లి చెరువు మత్తడి నీటితోపాటు మల్లారం కట్టు కాల్వ ద్వారా వచ్చే నీటి ప్రవాహం పెరిగినప్పుడు అదనపు వరద నీరు ఈ కాల్వ ద్వారా మూలవాగులోకి చేరుతుంది. రెండో బైపాస్ రోడ్‌ను ఆనుకొని ఉండడంతో ఈ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సర్వే నంబర్ 1411, 1412లో భూములు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు దాన్ని ఆనుకొని ఉన్న కాల్వను కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్నారు. అనుమతి తీసుకున్నామని దాదాపు 8 నుంచి 10 ఫీట్ల వరకు కాల్వను మట్టితో పూడ్చి కబ్జా చేసేశారు. నీటి ప్రవాహాన్ని తట్టుకు నేలా సిమెంటుతో గోడ నిర్మించారు. పొలాలు దెబ్బతింటున్నాయంటూ అనుమతి పొంది కాల్వను ఆక్రమించడంతోపాటు అదనపు నిర్మాణాలు చేపడుతున్నారు. కాల్వ చుట్టూ దాదాపు 300 అడుగుల మేర గోడ నిర్మాణానికి తెర లేపారు. భవిష్యత్‌లో వర్షాలు కురిసి వరద వస్తే తమ పొలాల పరిస్థితి ఏందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు లేఖలు రాశాం

వ్యవసాయ భూముల్లో నుంచి వెళ్తున్న వరదనీటి ప్రవాహం ఉన్న కాల్వ హద్దుల కోసం ఇప్పటికే అధికారులకు లేఖలు రాశాం. నిబంధనల మేరకు నడుచుకోవాలని అనుమతులిచ్చాం. సంబంధిత రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తేనే కాల్వను కాపాడతాం.

– శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ, వేములవాడ

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

ముస్తాబాద్: గిరిపుత్రుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అందరికి ఆదర్శమని వైద్యాధికారి డాక్టర్ చందర్ నాయక్ అన్నారు. సేవాలాల్‌తండాలో సేవాలాల్, జగదాంబ ఆలయాల వార్షిక వేడుకలను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక బండారు, అభిషేకం నిర్వహించారు.